క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ శుక్రవారం తెలిపారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని కోరారు.

సెప్టెంబర్ 2న జాబ్ మేళా

క్రోసూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, క్రోసూరు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌ను పెదకూరపాడు నియోజకవర్గ పరిసర ప్రాంత యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయని, జీతం విద్యార్హతను బట్టి ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌కు పది నుంచి పీజీ వరకు చదువుకున్న 18–35 సంవత్సరాల నిరుద్యోగ యువతీయువకులు బయోడేటా, సర్టిఫికెట్స్‌తో నేరుగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు హాజరు కావచ్చన్నారు. వివరాలకు బి.అంజిరెడ్డి–7779858789, ఇ.రామకృష్ణారెడ్డి –8074393466లను సంప్రదించవచ్చన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడుతున్న నియోజకవర్గంలోని నలుగురికి సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని నందిగామకు చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావుకు రూ.1,06,239, రెంటపాళ్ళకు చెందిన నంబూల జస్వంత్‌కు రూ.79,698, సత్తెనపల్లి పట్టణానికి చెందిన సాకి అమరవాణికి రూ.62,729, రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన వేపూరి రామయ్యకి రూ.58,714 చెక్కులు అందజేశారు.

శ్రీనివాసరెడ్డికి 'తెలుగు తేజం' పురస్కారం



పెదకూరపాడు : పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి 'తెలుగు తేజం' పురస్కారంకు ఎంపికైనట్లు అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక శుక్రవారం ప్రకటించింది. ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా, వ్యాస కర్తగా, కవిగా సాహిత్య రంగానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసరెడ్డికి ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతి–తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీన పల్నాడు జిల్లా, నరసరావుపేటలో నిర్వహించనున్న సాహిత్య మహోత్సవంలో వివిధ రంగాల్లోని ప్రముఖ వ్యక్తులు పాల్గొని ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఈ పురస్కారానికి ఎంపికైన శ్రీనివాసరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు తిరుమలేష్, గోవింద రాజులు, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పల్నాడు జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ టి.చంద్రయ్య, ఎస్ఎంసీ చైర్ పర్సన్ బి.చంద్ర కుమారి, పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

శిరస్సు వ్యాధులకు నస్యకర్మ మేలు



రాజుపాలెం: శిరస్సు వ్యాధులకు నస్యకర్మ చేయడం వలన వ్యాధులను తగ్గించడం జరుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోటనెమలిపురి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో రోగికి ఔషధ తైలాలను ముక్కు రంధ్రాల ద్వారా శరీరంలోకి పంపి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల, మెడ భాగాలలోని వ్యాధులను నివారించడానికి ఈ చికిత్స ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తల, మెడ, కళ్లు, చెవులు, ముక్కు, నోరు వంటి భాగాల ఆరోగ్యానికి నస్యకర్మ ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరు ఈ చికిత్సను ఉపయోగించుకోవాలని చెప్పారు.

బస్సు, లారీ ఢీకొని ప్రయాణికులకు గాయాలు

రాజుపాలెం: ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో బస్సులోని వారికి స్వల్పంగా గాయాలైన ఘటన అనుపాలెం సమీపంలోని పెద్దకాలువ బ్రిడ్జిపై శుక్రవారం జరిగింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు గుంటూరు వెళుతుండగా అదే సమయంలో లారీ గుంటూరు నుంచి పిడుగురాళ్ల వెళుతుండగా కాలువ బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీకి, బస్సుకు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. అతివేగంగా వెళ్లడం వలన ఈ ప్రమాదాలు జరిగినట్లు బస్సులోని వారు తెలిపారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

యూరియా కొరత.. ఆందోళనలో అన్నదాత

- అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులు
- పురుగు మందులు కొంటేనే యూరియా అంటున్న మనగ్రోమోర్
- పీఏసీఎస్‌ల ద్వారా రైతుకు 2 కట్టలు మాత్రమే విక్రయం



అచ్చంపేట పీఏసీఎస్ వద్ద వేచి ఉన్న రైతులు



పీఏసీఎస్ గోడౌన్‌లో యూరియా కట్టలు

అచ్చంపేట/అమరావతి: అచ్చంపేట, అమరావతి మండలాల్లో యూరియా కష్టాలు మొదలయ్యాయి. యూరియా అసలు ధర రు.266.50కు విక్రయించవలసి ఉండగా ఎరువుల దుకాణాలలో రూ.350–400 వరకు విక్రయిస్తున్నారు. అలాగే డీఏపీ రూ.1350కు అమ్మాల్సి ఉండగా రూ.1500కు, అలాగే రూ.1300కు అమ్మాల్సిన 20–20 ఎరువు కట్ట రూ.1450కు విక్రయిస్తున్నారు.

జేబులు నింపుకుంటున్న వ్యాపారులు

రైతులకు అవసరమైన ఎరువులను వ్యాపారులు అధిక ధరలకు అమ్మకాలు సాగించి జేబులు నింపుకుంటున్నారు. అచ్చంపేట మండలంలో రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు వేశారు. నిన్నమొన్నటి వరకు అధిక వర్షాలతో భూమిలో తేమశాతం ఎక్కువై పొలంలోకి వెళ్లలేకపోయిన రైతులు గురు, శుక్రవారాలలో కొద్దిపాటి ఎండ, గాలులు వీయడంతో యూరియా కట్టలు వేసేందుకు ఉపక్రమించారు. కాని బహిరంగ మార్కెట్‌లో కావలసినంత యూరియా లభించడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుని ఎరువుల దుకాణం డీలర్లు ఏకంగా కట్టకు రూ.100–150 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

అమరావతి మండలంలో...

మండలంలో 10 వేల హెక్టార్లలో వేసిన పత్తి, 3 వేల హెక్టార్ల మిరప పైరుకు అవసరమైన యూరియా, డీఏపీ, 20–20 ఎరువులు నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో రోజుకు సుమారు 2 వేల యూరియా కట్టలు, 500 నుంచి 1000 వరకు డీఏపీ, 20–20 ఎరువు కట్టలు అవసరమవుతాయి. ఇటీవల వానలు కురిసి భూమిలో పదును ఉండటంతో రైతులు యూరియా అధికంగా వినియోగిస్తున్నారు.

పురుగు మందు కొంటేనే...

రైతులు యూరియా కట్ట కోసం మనగ్రోమోర్‌కు వెళితే తామిచ్చిన (అదీ రైతులు కోరినది కాదు) పురుగు మందులు కొనుగోలు చేస్తేనే యూరియా కట్ట ఇస్తామంటున్నారు. ఆ పురుగు మందు కూడా లీటరు ఎమ్మార్పీ ధర రూ.1000–1200 వరకు ఉంటే రూ.1700కు అంటగడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమంటే స్టాకు లేదు పొమ్మనమని కసురుకుంటున్నట్లు చెబుతున్నారు.

అలంకార ప్రాయంగా రైతు సేవా కేంద్రాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళకళలాడిన ఆర్బీకేలు(రైతు సేవా కేంద్రాలు) అంకార ప్రాయంగా ఉన్నాయి. అధిక ధరలను అరికట్టలేకపోయినా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన యూరియా, డీఏపీ విక్రయించే దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. పీఏసీఎస్‌లో మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన ధరకు.. ఒక్కొక్క రైతుకు రెండు కట్టలు మాత్రమే విక్రయిస్తున్నారు. 5–6 ఎకరాలు సేద్యం చేసే రైతుకు ఎకరాకు కనీసం రెండు కట్టలు అవసరం అవుతాయి. రెండు కట్టలు మాత్రమే ఇస్తే మిగిలిన కట్టలు బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

నామమాత్రపు తనిఖీలు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు ఏవోతో ప్రత్యేక బృందంగా ఏర్పడి నామమాత్రపు తనిఖీలు చేసి అంతా బాగుంది అంటూ మమ అనిపించారు. ఎరువుల దుకాణదారులు స్టాకు ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారు. అధిక ధరలను నియంత్రించకపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పురుగు మందు కొంటేనే యూరియా



నేను రెండు ఎకరాలలో పత్తి, రెండు ఎకరాలలో మొక్కజొన్న పంటలు వేశా. అధిక వర్షాల వల్ల నిన్నమొన్నటి వరకు పొలంలోకి వెళ్లలేకపోయా. యూరియా కోసం మన గ్రోమోర్‌కు వెళితే పురుగు మందులు కొంటేనే ఇస్తామన్నారు. సొసైటీలో ఈ రోజే స్టాకు వచ్చినట్లు చెప్పారు. ఒక్కొక్క రైతు 2 కట్టలు ఇస్తామంటున్నారు. నాకు కనీసం 8 కట్టలు అయితేగాని సరిపోవు.

– చెలికాని మల్లిఖార్జునరావు, రైతు, తాళ్లచెరువు

కృత్రిమ కొరత సృష్టించే కుట్ర



ఖరీఫ్ సీజనుకు అవసరమైన యూరియా, ఎరువులను అంచనా వేసి లక్ష్యానికి అనుగుణంగా కేంద్రం నుంచి ఎరువులు రాబట్టంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. డబుల్ ఇంజన్ సర్కారు వల్ల రైతులకు జరిగిన మేలు ఏమిలేదు. పరిమితంగా ఉన్న యూరియా, ఎరువులు కూడా పాలకపక్షానికి అనుకూలురైన వ్యాపారుల దగ్గర నిల్వ ఉండటంతో ఇష్టారాజ్యంగా ధర పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నట్లు శాస్త్ర ప్రామాణికంగా రుజువులున్నా నానోఎరువును రైతులచేత బలవంతంగా వాడించేందుకు కేంద్ర ప్రభుత్వం కృత్రిమ యూరియా కొరతను సృష్టించే కుట్ర చేస్తుంది.

– యేపూరి గోపాలరావు, అధ్యక్షుడు, పల్నాడు జిల్లా రైతు సంఘం

యూరియా కొరత లేదు



ప్రస్తుతానికి మండలంలో యూరియా కొరత లేదు. పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎమ్మార్పీ ధరకు విక్రయిస్తున్నాం. రెండు రోజుల్లో జీడీసీఎంఎస్ గోడౌన్ ద్వారా కూడా యూరియా అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రోమోర్‌లో వేరే మందు కొంటే గాని యూరియా ఇస్తామనడం సరికాదు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఎరువుల దుకాణాలలో అసలు స్టాకు లేదు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

నిమజ్జన ప్రాంతాల పరిశీలన



ముప్పాళ్ళ: వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. మండలంలోని పలు చోట్ల వినాయక నిమజ్జనం జరిగే ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముప్పాళ్ళలోని పెదనందిపాడు బ్రాంచికాలువ, గుంటూరు బ్రాంచి కాలువ, దమ్మాలపాడు, రామకృష్ణాపురం గ్రామాల వద్ద గల కాల్వలను పరిశీలించారు. బారికేడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రాత్రి వేళ వెలుతురు ఉండేలా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అవసరమైతే క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్వో రస్కిన్ పాల్గొన్నారు.

బలిజేపల్లి ఎస్సీ కాలనీలో 'ఫ్రైడే–డ్రైడే'



రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లి ఎస్సీ కాలనీలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం ఆరోగ్య సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రత గురించి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. టైర్లు, రోళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి ఎబెట్ ద్రావణం చల్లారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఏఎన్ఎం నాగమల్లేశ్వరి, ఆశా కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులు

పెదకూరపాడు : తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో వారి చిత్రపటాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి భాషా ఉద్యమాలకు గొడుగు లాంటి వారిని కొనియాడారు. వాడుక భాషను వ్యతిరేకించే వారికి ఆయన పిడుగు లాంటి వారిని అన్నారు. తెలుగు వాడుక భాషకై ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. గిడుగు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరపటం ఆంధ్రులకు గర్వకారణమన్నారు. ధ్యాన్‌చంద్ ఒలింపిక్ గేమ్స్‌లో హాకీ క్రీడలో స్వర్ణ పతకం తెచ్చి పెట్టారని, ఆయన పేరున క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును బహుకరిస్తారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అమరావతి పబ్లిక్ స్కూల్లో తెలుగు అకారంలో కూర్చున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

సత్తెనపల్లి: మాతృభాషపై మమకారం పెంచుకోవాలని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని అమరావతి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తెలుగు అనే అక్షరం రూపంలో కూర్చొని తెలుగు భాషపై ఉన్న గౌరవం, అభిమానాన్ని తెలియజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతతో కూడిన ఈ ప్రదర్శన అందరిలోనూ తెలుగు భాష పట్ల మమకారాన్ని కలిగించిందన్నారు. యువత తెలుగు భాష పట్ల గౌరవాన్ని, ప్రేమను పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాటికలు, పద్యాల పఠనం వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలుగు భాష వైభవాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలు నేర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలను నేర్చుకోవాలని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జయశీల అన్నారు. పట్టణంలోని హోలీఫ్యామిలీ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకునేలా చేపట్టారు. క్రీడా దినోత్సవంను పురస్కరించుకొని మేజర్ ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతులైన విద్యార్థులకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ సునీత కుమారి, తెలుగు ఉపాధ్యాయినులు సత్యవతి, భాగ్యలక్ష్మి, రాగినిరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న హెడ్‌మిస్ ఉమాకల్యాణి

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని భవిష్య పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మిస్ ఉమాకల్యాణి అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని భవిష్య హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాకల్యాణి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత కలిగి, సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఐసీటీసీ కౌన్సిలర్ రఘునాథ్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం విరమణ, హెచ్ఐవీపై పోరాటంలో యువత పాత్ర ముఖ్యమని, యువత సరియైన లక్ష్యంతో జీవితంలో విజయం సాధించాలని అన్నారు. హాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ప్రతినిధి నాగలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 2 నెలల ఐఈసీ ప్రోగ్రాం గురించి వివరించారు. ఈశ్వర్, జ్యోతిలు మాట్లాడారు. హెచ్ఐవీపై అపోహలు, అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో పీఈలు శాంత కుమారి, సుజాత, విజయకుమారి, లక్ష్మీ, నాగూర్ బాషా, ఎస్తేర పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంతరెడ్డి

సత్తెనపల్లి: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను ప్రతిరోజు అరగంట పాటు ఆడాలన్నారు. తద్వారా శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో ఉండటం వల్ల ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. తహసీల్దారు కేఎస్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులో క్రీడా బాధ్యతలు స్వీకరించడం వల్ల ఉత్తమ పౌరులుగా మారతారని చెప్పారు. ముందుగా విద్యాలయంలో ఎన్నికైన కెప్టెన్(బాలురు,బాలికలు), వైస్ కెప్టెన్, క్రీడా కెప్టెన్, నాలుగు విభాగాల కెప్టెన్లకి బ్యాడ్జీలు అలంకరించారు. నాలుగు విభాగాల విద్యార్థుల గౌరవ వందనాన్ని సమర్పించారు. క్రీడా దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ గుప్తా, ఎల్‌వీఎన్ కుమార్, బి.కిరణ్ రెడ్డి, సంగీత ఉపాధ్యాయుడు హరిశంకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నవరాత్రులు



గుడిపూడిలో వినాయకుడి గ్రామోత్సవంలో ట్రాక్టర్ నడుపుతున్న డాక్టర్ గజ్జల



గణేష్ మండపం వద్ద అన్నసంతర్పణలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



లక్ష్మీగణపతికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గ్రామగ్రామానా పూజలందుకుంటున్న గణనాథుడు

సత్తెనపల్లి: వాడవాడలా గణేష్ మండపాల వద్ద సందడి నెలకొంది. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి శుక్రవారం మూడో రోజు విశేష పూజలు చేశారు. తాము తలపెట్టే ఏ కార్యంలోనూ విఘ్నం తలెత్తకుండా చూడాలని విఘ్నేశ్వరుని వేడుకున్నారు. పట్టణంలోని గాంధీ చౌక్, పాత బస్టాండ్ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి పూజలు చేశారు. అన్న సంతర్పణ ప్రారంభించారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన నాలుగు వినాయక మండపాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. అన్న సంతర్పణకు వంటను ప్రారంభింపచేశారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి ట్రాక్టర్‌పై ఏర్పాటు చేయగా ఆయన ట్రాక్టర్ నడిపి కమిటీలను ప్రోత్సహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, కొర్లకుంట వెంకటేశ్వర్లు, బొంతు వెంకటరెడ్డి, తిరుపతిరావు, గుడిపూడి నాగేశ్వరరావు, గుంటూరు నతానియేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

పెదకూరపాడు : మండలంలోని బలుసుపాడు గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలను అర్చకులు నుదురుపాటి హనుమంతరావు శర్మ నిర్వహించారు. లక్ష్మీగణపతిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ ఏర్పాట్లు చేశారు.అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార సహాయ కార్యదర్శి బచ్చు హనుమంతరావు, గ్రామ పెద్దలు హనుమంతరావు, మారెళ్ళ కోటేశ్వరరావు, అంబటి వెంకట నరసింహారావు, సాంబశివరావు, మండపల్లి సుబ్బారావు, ఏపూరి శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

నకరికల్లు: వినాయక నిమజ్జన వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినాయకచవితి అనంతరం మూడోరోజు చల్లగుండ్ల అడ్డరోడ్డు, చేజర్ల, నర్సింగపాడు, గుండ్లపల్లి, చల్లగుండ్ల, నకరికల్లు తదితర గ్రామాల్లో మొత్తం 12 విగ్రహాల నిమజ్జనం గావించారు. ముందుగా భక్త సంఘం ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదాన్ని వేలంపాట నిర్వహించగా, భక్తులు పోటీపడ్డారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగింపు నిర్వహించారు. నర్సింగపాడులో క్రేజీబాయ్స్ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవం సందర్భంగా విఘ్నేశ్వరుని ప్రతిమను గోపిరెడ్డి యానాదిరెడ్డి, 25 కేజీల లడ్డూప్రసాదాన్ని బిజ్జం రమణారెడ్డి అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం తీన్‌మార్ నడుమ ఎన్నెస్పీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.



నర్సింగపాడులో నిమజ్జనానికి తరలిన గణేశుడు

విద్యుత్ లైన్‌మన్‌పై దాడి

సత్తెనపల్లి: విద్యుత్ లైన్‌మన్‌పై దాడి జరిగిన ఘటన సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధూళ్ళిపాళ్ల గ్రామంలోని బ్రహ్మం గారి గుడికి రెండు గదులు ఉన్నాయి. ఆ గదులకు విద్యుత్ సరఫరా లేదు. వీటిలో ఓ గదిని గ్రామానికి చెందిన షేక్ జానీ అద్దెకు తీసుకున్నాడు. ఆ గదికి మీటర్ కోసం దరఖాస్తు చేయగా అధికారులు ల్యాండ్ ఓనర్‌షిప్, పంచాయతీ నుంచి అభ్యంతరం లేదనే సర్టిఫికెట్లు కావాలని చెప్పి దరఖాస్తును తిరస్కరించారు. విద్యుత్ లైన్‌తీగలపై వైర్లు వేసి వినియోగిస్తుండడంతో లైన్‌మన్ బాణావత్ గోవింద నాయక్ శుక్రవారం ఉదయం తొలగించాడు. దీనిపై లైన్‌మెన్ గోవిందునాయక్‌కు ఫోన్ చేసి తాను నెల క్రితమే విద్యుత్ మీటర్ కొరకు దరఖాస్తు చేశానని, ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని జానీ అడిగాడు. దీనిపై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. లైన్‌మన్ గోవిందునాయక్‌పై షేక్ జానీ, బందారుపల్లి మణికంఠ, మరికొందరు కలిసి దాడి చేశారు. దీంతో గోవిందునాయక్ తలపగిలి తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్య సేవలు పొంది సత్తెనపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో గోవిందునాయక్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు యూరియా వెంటనే అందించాలి

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు

క్రోసూరు: రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు శుక్రవారం అన్నారు. యూరియా నిల్వలు ఏ విధంగా ఉన్నాయి అని తెలుసుకోవడానికి క్రోసూరు మార్కెట్‌యార్డ్‌లోని జీడీసీసీ బ్రాంచ్ గోడౌను, గ్రోమోర్ ఎరువుల గోడౌను, క్రోసూరు సొసైటీ గోడౌను, క్రోసూరు రైతు సేవ కేంద్రాలను పరిశీలించగా ఎక్కడా యురియా నిల్వలు లేకపోవటం గమనించటం జరిగిందని, దీనిపై గోడౌన్ ఇన్‌చార్జిలతో చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ రైతాంగానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266.5 అందిస్తున్నట్లు బోర్డు పెట్టినప్పటికీ ఆయా గోడౌన్లలో వారం రోజులుగా ఒక్క కట్ట యూరియా కూడా లేదని, అదే యూరియా బస్తా రూ.400కు పైగా అమ్మే ప్రైవేటు షాపుల వద్ద యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. దీంతో ప్రభుత్వ వైఖరి అర్థం అవుతుందన్నారు. అధికారులు యూరియా కొరత లేదని, ప్రకటనలు చేస్తున్నప్పటికీ రైతులకు అందడం లేదని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం యూరియాను అందుబాటులో ఉంచకుండా నానో యూరియాని వాడుకోండి అని చెప్పటం హాస్యాస్పదమని అన్నారు. యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు పాల్గొన్నారు.

క్రోసూరులో విద్యుత్ డీఈఈ కార్యాలయం

క్రోసూరు: విద్యుత్ శాఖ క్రోసూరులో సత్తెనపల్లి రూరల్ సబ్‌డివిజన్ డీఈఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ఏఈ ఎం.బసవరాజు శుక్రవారం తెలిపారు. క్రోసూరులోని నాలుగు రోడ్లసెంటర్‌లో ఇండోర్ స్టేడియం వద్ద డీఈఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లుతెలియజేశారు. డీఈఈ ఎం.శ్రీనివాసరావుఫోను: 639 741039గా తెలిపారు.